సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఇరుక్కున్న భారీ ట్రాలర్

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- డివైడర్ తొలగించేందుకు చర్యలు

గోపాలపట్నం: భారీ ట్రాన్స్‌ఫార్మ్‌తో వచ్చిన ట్రాలర్ గోపాలపట్నం సీఎంఆర్ సమీప ప్రశాంతినగర్ అప్రోచ్ రోడ్డులో నిలిచి పోయింది. రైల్వే స్టేషన్ రోడ్డు లోనుంచి ఆదివారం రాత్రి 3 గంటల సమయంలో వచ్చి ప్రధాన రహదారి సర్వీస్ రోడ్డులోకి తిప్పలేక డ్రైవర్ నిలిపి వేశారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ దారి గుండా కార్లు, ఆటోలు వంటి వాహనాలు రాకుండా ఏర్పాట్లు చేశారు. రైల్వే శాఖ ఉన్నతాధికారులు జీవీఎంసీ అధికారులతో మాట్లాడి డివైడర్ తొలగించి ట్రాలర్ బయటకు వచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడి రహదారిపై అవగాహన లేకుండా భారీ వాహనాలు తీసుకు రావడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ట్రాఫిక్ అధికారులకు కూడా సమాచారమివ్వ లేదని చెబుతున్నారు.

మానవత్వం పరిమళించిన వేళ



సంప్‌లో నుంచి కుక్కను బయటకు తీస్తున్న కార్మికుడు

గోపాలపట్నం: సంపులో ప్రమాదవశాత్తు పడిపోయిన కుక్కను మానవత్వంతో పారిశుధ్య కార్మికులు కాపాడారు. గోపాలపట్నం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న సంప్‌లో సోమవారం కుక్క పడిపోయింది. దీంతో భయాందోళనకు గురై ఆర్తనాదాలు పెట్టింది. దీంతో కార్యాలయ సిబ్బంది పారిశుధ్య అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ దమ్ము శ్రీనివాసరావుకు సమాచారమందించారు. తమ కార్మికుడైన కనకరాజుతో కలసి సంప్‌లో పడిన్న కుక్కని బయటకు తీశారు. కుక్కను కాపాడిన పారిశుధ్య కార్మికులను అభినందించారు.

అభాగ్యుడికి ఆశ్రయం



ఆస్పత్రి నుంచి ఆశ్రమానికి తీసుకొస్తున్న మమత

విశాఖ విద్య: ఫుట్‌పాత్‌పై గడుపుతున్న అభాగ్యుడికి జీవీఎంసీ బుచ్చిరాజుపాలెం షెల్టర్ మేనేజర్ మమత ప్రత్యేక చొరవ తీసుకొని ఆశ్రయం కల్పించారు. నగరంలోని పోర్ట్ ఏరియా లో ఒక వ్యక్తి మానసికపరిస్థితి బాగోక చాలా రోజులుగా తిరగడంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో బుచ్చిరాజుపాలెం షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ప్రస్తుతం అతను కోలుకోవడంతో డిశ్చార్జి చేయించి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ నిరాశ్రయవసతి గృహానికి సోమవారం తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. ఈ వ్యక్తి పేరు ప్రదీప్ అని చెబుతున్నాడు. మిగిలిన వివరాలు కనుక్కొని వారి కుటుంబ సభ్యులకు అప్పగించే ప్రయత్నం చేస్తామని మేనేజర్ మమత తెలిపారు.

27 డిఫెన్స్ మద్యం బాటిళ్ల స్వాధీనం



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

మల్కాపురం: గాజువాక ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి డిఫెన్స్ మద్యం తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 27 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాలు.. 58వ వార్డు ములగాడలో చట్టిబోయిన మల్లికార్జునరావు,కర్రి గంగరాజు అనే ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై డిఫెన్స్ మద్యం తరలిస్తున్నట్టు అధికారులు సమాచారం అందుకున్నారు. దీంతో మాటు వేసి ఆ మార్గంలో వస్తున్న వారిని తనిఖీ చేసి మద్యం బాటిళ్లు ఉన్నట్టు గుర్తించారు. దీంతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ ఈ.రామకృష్ణ తెలిపారు.

రోగులకు యాప్ సోపాలు!

ఓపీ తీసుకోవాలంటే ఓపిక **అవసరం... ఓపిక లేని వారు వేచి ఉండలేక వెనుదిరు**గుతున్నారు. యాప్ కష్టాలతో **గంటల** కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. **మరి కొం**తమందికి అవగాహన లేకపో**వడంతో** ఇబ్బంది పడుతున్నారు. దీం**తో ఏంటి** ఈ యాప్ కష్టాలని రోగులు **మండిపడు**తున్నారు. ఇది గోపాలపట్నం **కమ్యూనిటీ** హెల్త్ సెంటర్‌లో పరిస్థితి.

– గోపాలపట్నం

- డిజిటల్ నమోదుతో ఇబ్బందులు
- సౌకర్యాలు లేక చాలా ఆలస్యం
- గంటల కొద్దీ నిరీక్షిస్తున్న వ్యాధిగ్రస్తులు
- సిబ్బంది కొరత, నమోదుకు సరిపడా కంప్యూటర్లు లేని వైనం



గోపాలపట్నం ఆస్పత్రి వద్ద క్యూలో ఓపీ కోసం రోగులు



ఓపీ కౌంటర్ వద్ద గుమిగూడిన రోగులు

గతంలో మాన్యువల్‌గా ఓపీ ఇచ్చేవారు. ఇప్పుడు విధానం మార్చేశారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా అంతా డిజిటలైజేషన్ చేశారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రికి వచ్చేవారు ఇక్కడి అభ యాప్‌లో నమోదు కావాలని సిబ్బంది సూచిస్తున్నారు. అక్కడ నమోదు అయిన తర్వాతే ఓపీ ఇస్తున్నారు. దీంతో ఫోన్లలో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. మరో వైపు సర్వర్ సమస్య వెంటాడుతోంది. ఇది నమోదు చేయడం ఒకరిద్దరి వల్ల కావడం లేదని ఆస్పత్రి వర్గాలు వాపోతున్నారు. సోమవారం అత్యధికంగా వ్యాధిగ్రస్తులు రావడంతో క్యూలైన్‌లో గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్నం వరకు ఓపీ ఇస్తూనే ఉన్నారు. సోమవారం సమారు 350 వరకు ఓపీ నమోదు అయిందని సూపరింటెండెంట్ సుజాత తెలిపారు.

అవగాహనలేకే ఆలస్యం...

వ్యాధిగ్రస్తులకు అభ యాప్ గురించి అవగాహన లేక పోవడంతో తీవ్ర జాప్యం కలుగుతుందని సిబ్బంది చెబుతున్నారు. దీనిపై వారికి అవగాహన కల్పించేవారు లేరు. ఈ యాప్ ఏవిధంగా చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నారని.. మాన్యువల్‌గా ఓపీ రాయడం వల్ల కూడా ఆలస్యమవుతుందని వాపోతున్నారు.

కొత్త విధానంతో ఇబ్బంది



గతంలో వివరాలు చెబితే ఓపీ ఇచ్చేవారు. ఇప్పుడు ఓపీ కోసం వెళితే ఇబ్బందులు తప్పడం లేదు. యాప్ ఉండాలని చెబుతున్నారు. దీనికి తోడు సోమవారం కావడంతో వ్యాధిగ్రస్తులు ఎక్కువగా వచ్చారు.ఓపీ తీసుకుని వెళ్లే సరికి డాక్టర్లు ఉంటారో ఉండరో అన్న భయం పట్టుకుంది. –**గాయత్రి**, చంద్రనగర్

చాలా ఆలస్యమవుతోంది



గంటకు పైగా లైన్లోనే ఉన్నాను. ఇక్కడికి ఇదే మొదటి సారి రావడం. ఆస్పత్రికి రోగుల తాకిడి కేజీహెచ్‌ను తలపించేలా ఉంది. మధ్యాహ్నం అయినా లైన్లో ఉన్నాను. ఎప్పుడు ఓపీ ఇస్తారు.. ఎపుడు డాక్టర్‌ను కలుస్తానోనని ఆందోళనగా ఉంది. – **సోమినాయుడు**, ఇందిరానగర్

ఆధార్ కార్డు ఉండాలి

ఇంతకు ముందులా పేరు చెప్పి ఓపీ తీసుకోవడం కుదరదు. ఆస్పత్రికి వచ్చేవారు ఆధార్ కార్డు తప్పని సరిగా తీసుకు రావాలి. స్మార్ట్ ఫోన్ కూడా ఉండాలి. దీని ద్వారా అభ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఓపీ తీసుకునే సమయంలో సిబ్బందికి సహకరించాలి. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా కంప్యూటర్ టోకెన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

–**సుజాత**, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ గోపాలపట్నం

భూసర్వే నివేదిక కోసం ఆందోళన

- తహసీల్దార్ కార్యాలయం ముందు లబ్ధిదారుల నిరసన



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

విశాఖ విద్య: జీవీఎంసీ 49 వ వార్డు కప్పరాడ గ్రామం సర్వే నెం:13/ఏ లో బర్మా కాందిశీకుల ఇళ్ల స్థలాలకు సంబంధించిన సర్వే రిపోర్టు ఇవ్వాలని కోరుతూ బాధిత లబ్ధిదారులు సోమవారం గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బర్మా కాందిశీకులు పునరావాస సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారాయణ రావు మాట్లాడుతూ బర్మా కాందిశీకులకు పునరావాసాల ఏర్పాటు చేయడం కోసం కప్పరాడ గ్రామంలో సర్వే నెంబర్ 13/ఏ లో 9 ఎకరాల 50 సెంట్లు కలెక్టర్ పేరు మీద ప్రభుత్వం తీసుకుందన్నారు. ఆ భూమి నేటికీ బర్మా కాందిశీకుల్లో నిజమైన లబ్ధిదారులకు చెందలేదన్నారు. రెవెన్యూ రికార్డుల్లో పొందుపరచలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయమై స్పందనలో పలు సార్లు అర్జీలు పెట్టినా, ఆర్టీఐ చట్టం ద్వారా సమాచారం అడిగినా రెవెన్యూ అధికారులు పొంతన లేని సమాచారం అందిస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. 18 ఏళ్లుగా స్థలాల కోసం పోరాడుతున్నామని, ఎమ్మెల్యే కూడా మాకు న్యాయం చేయట్లేదని విమర్శించారు. దళితులమనే చిన్న చూపుతోన్యాయం చేయకపోగా మాపై కేసులు పెట్టి కోర్టు చుట్టూ తిరిగేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద ఉన్న రికార్డులు చూపిస్తే అవి తప్పుడు రికార్డులు అంటున్నారని వాపోయారు. 2024లో రెవెన్యూ, దేవస్థానం ఆధ్వర్యంలో ఉమ్మడి సర్వే చేశారని, ఆ సర్వే రిపోర్ట్ ఇవ్వాలని కోరితూ దాట వేత ధోరణి అవలంబిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఎయిర్‌పోర్టు పోలీసులు అక్కడికి చేరుకొని బర్మా కాందిశీకులకు సర్దిచెప్పి అక్కడ నుంచి పంపించారు.

వాటర్ వర్క్స్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

విశాఖ విద్య: వేతనాల పెంపు విషయంలో జీవీఎంసీ పాలక మండలి పెద్దలు, అధికారులు అవలంబిస్తున్న విధానాలపై వాటర్ వర్క్స్ కార్మికులుఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ మేయర్ ఇచ్చిన హామీ ప్రకారం బుధవారంలోగా తమవేతనాలు పెంచకపోతే, నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ మేరకు జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం బ్లాక్–24 వద్ద వాటర్ వర్క్స్ కార్మికులు నల్ల రిబ్బన్లు ధరించి సోమవారం కొద్ది సేపు నిరసన తెలిపారు. మే నుంచి వేతనాలు పెంచాల్సి ఉన్నప్పటికీ పాలక మండలి పెద్దలు అవాంతరాలు సృష్టించడం ఎంతవరకు సమంజసమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీ చాలని జీతాలతో కుటుంబాలు గడువడం కష్టంగా మారిందని, ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు కూడా అందడం లేదని వాపోయారు. వేతనాల పెంపుపై బుధవారం లోపు స్పష్టత ఇవ్వకపోతే నిరవధిక సమ్మె చేస్తామని కార్మికులు తెలిపారు.

పోరాటాల ఫలితమే మినీ సెంటర్ల అప్‌గ్రెడేషన్



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

డాబాగార్డెన్స్: అంగన్‌వాడీ మినీ వర్కర్లకు అర్హతలో మినహాయింపు ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని మినీ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ కోరారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసిన సందర్భంగా జగదాంబ జంక్షన్ సమీపాన సిటు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మినీ వర్కర్ల విజయోత్సవ సభలో ఆమె మాట్లాడారు. అనేక పోరాటాల ఫలితంగా ఇటీవల రాష్ట్ర కేబినేట్ 4687 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయడానికి ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. సిటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు పి.మణి మాట్లాడుతూ మిగిలిన 1810 మినీ సెంటర్లలో మినీ వర్కర్లకు పదో తరగతి క్వాలిఫికేషన్ లేదని మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయకపోవడం సరికాదన్నారు. మినీ వర్కర్ల రాష్ట్ర కన్వీనర్ ఎస్.నాగేషు, రాష్ట్ర కార్యదర్శి ఎల్.దేవి, రాష్ట్ర నాయకులు ఎం.కృష్ణ, సీహెచ్.రామలక్ష్మి, ఎస్.లలిత, జి.వెంకటలక్ష్మి, ఎన్.వాసుదేవి, నరసయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం



రిటైర్ అయిన వారిని సత్కరిస్తున్న సొసైటీ పాలక సభ్యులు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ సొసైటీలో విధులు నిర్వహించి సోమవారం ఉద్యోగ విరమణ చేసిన బంగారయ్య,ప్రకాష్,రామారావుతను హెచ్‌పీసీఎల్ ఆవరణలో సత్కరించారు. సంస్థ సీజీఎం గంట కిరణ్‌కుమార్, సొసైటీ పాలక వర్గ సభ్యులు పూలమాలు వేసి,జ్ఞాపికలు అందించారు.సొసైటీ అభివృద్ధికి విశేష సేవలందించారని కొనియాడారు.

సచివాలయంలో కంప్యూటర్ల మూగనోము!

- అందని సేవలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



ఖాళీగా ఉన్న సచివాలయం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు వుడాకాల**నీలోని 1077018599** నెంబర్ గల సచివాలయం**లో కంప్యూటర్లు** పని చేయడం లేదు. దీంతో సచి**వాలయం పరిధిలో** ప్రజలు వివిధ సర్టిఫికెట్ల **కోసం వచ్చి వెను**దిరగాల్సిన పరిస్థితి నెలకొంది. **కొంతకాలంగా స**మస్య ఉన్నా.. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని సిబ్బంది చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి

వుడాకాలనీ సచివాలయానికి జనన, ఓబీసీ సర్టిఫికెట్ కోసం శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన సీహెచ్ అశోక్ నాలుగు రోజుల కిందట వెళ్లారు.అయితే అక్కడ పత్రాలను పరిశీలించి నమోదు చేసుకునే ప్రక్రియ మాత్రం జరగలేదు. దీంతో అశోక్ సిబ్బందిని ప్రశ్నిస్తే సిస్టమ్ పని చేయడం లేదని,రెండు రోజుల్లో పని పూర్తి చేస్తామన్నారు. మరలా సోమవారం కార్యాలయానికి వెళ్లి తన సర్టిఫికెట్ ఎంత వరకు వచ్చింది అని అడిగితే మరలా అదే సమాధానం. కంప్యూటర్లు పని చేయం లేదని. దీంతో విసుగు చెందిన ఆ వ్యక్తి జోన్–5 జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తన దృష్టిలో లేదని.. త్వరలో పరిష్కరిస్తామన్నారు. అయితే వుడాకాలనీ సచివాలయం పాటు మల్కాపురం, శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లోని సచివాలయాల్లో పలు కంపూటర్లు మూలకు చేరాయి. దీంతో సకాలంలో సేవలు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి షణ్ముఖరావు

గాజువాక: గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న ఈ నెల 5న నిర్వహించనున్న లోక్ అదాలత్ శిబిరంలో కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని 13వ అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు కోరారు. శిబిరం నిర్వహణపై కోర్టు కాంప్లెక్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించడం వల్ల లభించే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలని కోరారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసుల పరిష్కారానికి పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో రాజీ మార్గంద్వారా పరిష్కరించుకున్న కేసులకు అప్పీలు కూడా ఉండదన్న విషయాన్ని కక్షిదారులకు వివరిస్తే ఎక్కువమంది ఈ శిబిరాన్ని ఉపయోగించుకుంటారన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎస్.కవిత, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు యశోధర వేదమని, పలువురు సీఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇది మా దారి

ఫోకస్



ఇది మా దారి.. ఈ దారిలో ఎవరైనా వచ్చే ధైర్యం ఉందా..! అన్న మాదిరిగా వీధి కుక్కలు గుంపులుగా కాసి ఉన్నాయి. ఇది ఎక్కడో కాదు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సేవా మార్గంపై సోమవారం ఉదయం కనిపించిన దృశ్యం. వీధి కుక్కలు గుంపులుగా ఉండడంతో ఆ మార్గాన వచ్చే ధైర్యం చేయలేక వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీధి కుక్కల స్వైర విహారానికి అధికారులు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. – మల్కాపురం

బుచ్చిరాజుపాలెంలో పోలీసుల కార్డన్ సెర్చ్



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వవార్డు బుచ్చిరాజుపాలెం పరిసర ప్రాంతాల్లో ఎయిర్‌పోర్టుజోన్ పోలీసులు సోమవారం కార్డన్ సెర్చ్ చేపట్టారు. తెల్లవారుజామున సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ ప్రసాద్, సిబ్బందితో కలిసి ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. గవరవీధి, రెడ్డి వీధి, గొల్లవీధి, గాంధీ నగర్ కాలనీలో ఇళ్ల ముందు పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాల రికార్డులను పరిశీలించారు. రికార్డులు సరిగ్గా లేని 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికి ఈ కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్టు సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇక నుంచి నిరంతరం తనిఖీలు ఉంటాయని స్పష్టం చేశారు. అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులతో సహకరించాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులు నైపుణ్యం పెంచుకోవాలి

మహారాణిపేట: కర్మ యోగి డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం ద్వారా ప్రతి ప్రభుత్వ ఉద్యోగి నైపుణ్యం, సామర్థ్యం పెంచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కోరారు. విజయవాడ ఏపీఎస్‌డీపీఎస్ నుంచి జిల్లా అధికారులకు కర్మయోగి పోర్టల్‌పై ఆన్‌లైన్ ద్వారా ఇచ్చిన శిక్షణ అనంతరం ఆయన మాట్లాడారు. టెక్నాలజీకి అనుగుణంగా పని చేసేందుకు కర్మయోగి పోర్టల్‌ను ఏర్పాటు చేశారని, దీనిలో 10 కోర్సులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో ఉంచారని తెలిపారు. ఉద్యోగులంతా యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకుని, వారంలోగా మూడు కోర్సులు నేర్చుకోవాలని.. ఆన్‌లైన్ సర్టిఫికెట్ పొంది జిల్లాను ముందంజలో ఉంచాలని కోరారు. క్రమంగా మిగిలిన కోర్సులు పూర్తి చేయాలని సూచించారు. జిల్లా అధికారులు తమ కార్యాలయ పరిధిలో ఉద్యోగులు కోర్సులు పూర్తి చేసేలా పర్యవేక్షించాలన్నారు.

పైప్‌లైన్ మరమ్మతుల్లో వింతపోకడ!

- అక్రమ బడ్డీల రక్షణకు ప్రాధాన్యం



ఎమ్మెల్యే చెబితే పెడుతున్నామని ఈవోతో వాదిస్తున్న దుకాణదారులు



గోపాలపట్నం రైతు బజారు వద్ద దుకాణాలు తొలగిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: ఎట్టకేలకు తాటిపూడి పైప్‌లైన్ మరమ్మతులు పట్టాలెక్కాయి. అయితే ఇక్కడో వింతపోకడ ఉంది. పైప్‌లైన్ ఉన్న భాగంలో అక్రమంగా దుకాణాలు పెట్టడం వల్ల ఒత్తిడికి గురై కొన్ని సందర్భాల్లో పైప్‌లైన్ పేలుతోంది. నీరు వృథాగా పోతుంది. తరచూ లీకేజీలు సంభవిస్తున్నాయని అధికారులు గుర్తించారు. బడ్డీలు తొలగించి మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. అయితే ఇక్కడే బడ్డీల నిర్వాహకులు చక్రం తిప్పారు. పనులు జరిగినా తమకు నష్టం లేకుండా ఎమ్మెల్యేతో సిఫార్సు చేయించుకున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. దుకాణాలను జాగ్రత్తగా తొలగించి రక్షణగా ఉండే రైతుబజారులో ఉంచాలని... అందుకు రైతు బజారు అధికారులు చూసీ చూడనట్టు ఉండాలని ఆయన ఆదేశించారని దుకాణదారులు చెబుతుండడం విశేషం. నిత్యం రద్దీగా ఉండే రైతు బజారులో ఈ దుకాణాలు ఏవిధంగా పెడతారని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

ఎట్టకేలకు మరమ్మతులు

గత నెల పైప్‌లైన్ లీకేజీని స్థానికులు గుర్తించారు. ఈ నెల1న తాటిపూడి పైప్‌లైన్ అధికారులకు రైతు బజారు ఈవో ప్రసాద్ సమాచారమందించారు. ఎట్టకేలకు మరమ్మతులు ప్రారంభించారు. తాటిపూడిపైప్‌లైన్ ఏఈ రాజశేఖర్ దీనిపై స్పందిస్తూ దుకాణాలు తొలగించాలని నోటీసులు ఇచ్చామని వారి ఖర్చులతో దుకాణాలు తొలగించారని తెలిపారు. దుకాణాలు ఎక్కడ పెట్టుకున్నారు... ఏం చేశారన్న దాంతో తమకు సంబంధం లేదని తెలిపారు.



మరమ్మతులకు తవ్వుతున్న తాటిపూడి పైప్‌లైన్